# ఇనుప తుక్కు.. బిక్కు బిక్కు


పండా వీధిలో రహదారిపై స్క్రాప్ సామగ్రి

## జీవీఎంసీ 35, 39 వార్డుల్లో పదుల సంఖ్యలో స్క్రాప్ దుకాణాలు

## ప్రమాదకర వస్తువుల క్రయ, విక్రయాలతో స్థానికుల ఆందోళన

## పాదచారులు, వాహన చోదకులు మసిలే దారి లేకుండా కార్యకలాపాలు


పూలసందులో జనాన్ని ఇబ్బంది పెట్టేలా స్క్రాప్ లోడు కోసం ఆగి ఉన్న భారీ వాహనం


జీఎస్ఎన్ శాస్త్రి రోడ్డులో రహదారి పైన స్క్రాప్ సామగ్రి


జనతాబజార్ వద్ద..

**జగదాంబ:** ఎక్కడైన వీధికి ఒకటో రెండో స్క్రాప్ దుకాణాలు ఉంటాయి. కానీ జీవీఎంసీ 35వ వార్డులో పదుల సంఖ్యలో ఉన్నాయంటే నమ్మశక్యం కాదు. కాలువల పైన, గెడ్డల వద్ద, చిన్నపాటి స్థలం కనబడితే ఓ కంప్యూటర్ కాటా పెట్టి దుకాణం ఏర్పాటు చేసేస్తున్నారు. పోలీసుల నియంత్రణ లేకపోవడంతో ఇటువంటి దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రధానంగా జనవాసాల మధ్యలో ఈ దుకాణాల నిర్వహణ వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

**రోడ్లను ఆక్రమించుకుని..**

ఈ స్క్రాప్ దుకాణాల యజమానులు ఏదో ఒక చోట చిన్న బడ్డీ కానీ.. స్థలంకానీ అద్దెకు తీసుకుని తొలుత చిన్నగా కార్యకలాపాలు మొదలుపెడుతున్నారు. తర్వాత తమ దుకాణం చుట్టుపక్కల ప్రాంతాన్నంతా ఆక్రమించుకుని వ్యాపారం కొనసాగిస్తున్నారు. తుక్కుతో నిండిన సరుకుతో ఆ ప్రాంతం అంతా నిండిపోవడమే కాకుండా భారీ వాహనాల ద్వారా తమ సరుకు తీసుకొచ్చి లోడ్లు డంప్ చేసుకుంటున్నారు. దీంతో చిన్నచిన్న వీధులు కలిగిన ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోల వంటి వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. చిన్నారులు స్కూళ్లకు వెళ్లేదుకు ఇబ్బంది పడుతున్నారు. 35వ వార్డులోని జనతా బజార్, ప్రసాద్ గార్డెన్స్ వీధిలో, జీఎస్ఎన్ శాస్త్రి రోడ్డులోని స్క్రాప్ వ్యాపారులు అక్కడి రోడ్లను నచ్చినట్లు వాడుకుంటున్నారు. దీని వల్ల వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు.

**పోర్టు ముఖద్వారంగా...**

జీవీఎంసీ 35, 39 వార్డులకు పోర్టు ముఖద్వారం కావడంతో ఈ ప్రాంతంలోనే ఎక్కువగా స్క్రాప్ దుకాణాలు ఉన్నాయి. దీంతో పాటు టౌన్ కొత్త రోడ్డులో డంపింగ్ యార్డు ఉండడంతో యార్డుకు వచ్చిన సరుకులు స్క్రాప్ వ్యాపారులకు వరంగా మారిపోయాయి. పోర్టు పరిధిలో ఏ పెద్ద వస్తువు పోయినా ఆ పరిసరాల్లోని ఏదో ఒక స్క్రాప్ దుకాణానికే చేరుతుందనేది జగమెరిగిన సత్యం.

### గ్యాస్ కట్టర్‌తో భయం భయం..

వీధుల్లో స్క్రాప్ దుకాణాలు నిర్వహించడమే ఇబ్బందికరం అంటే.. అందులో ఉపయోగించే సామగ్రి మరింతగా ఇబ్బంది పెడుతుంటాయి. ముఖ్యంగా గ్యాస్ కట్టర్ గురించి చెప్పుకోవాలి. భారీ స్క్రాప్ వాహనాలు, పాడైన గ్యాస్ సిలిండర్లు, ఐరన్ వస్తువులు, ఫ్రిజ్‌లు, ఏసీల వెనుక ఉండే గ్యాస్ సిలిండర్ల వంటి వాటిని కట్ చేయడానికి గ్యాస్ కట్టర్‌నే వాడుతారు. ప్రమాదకరమైన గ్యాస్ కట్టర్ వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని స్థానికులు బిక్కుబిక్కుమంటూ రోజులు గడుపుతున్నారు. ఇటీవలె జాలరిపేటలోని ఓ గ్యారేజీలో గ్యాస్ సిలిండర్ పేలి పెద్ద ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఎప్పుడేం జరుగుతుందోనన్న భయంతో జీవిస్తున్నామని వన్‌టౌన్ ప్రజలు చెబుతున్నారు.

## పోర్ట్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత


పరిసరాలను శుభ్రం చేస్తున్న పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్, వేణుగోపాల్, సిబ్బంది

**మహారాణిపేట:** విశాఖ పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో 'ఏక్ దిన్-ఏక్ గంటా-ఏక్ సాథ్' కార్యక్రమాన్ని గురువారం సాలిగ్రామపురంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో నిర్వహించారు. పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే ఆధ్వర్యంలో కార్యదర్శి టి.వేణుగోపాల్ సహకారంతో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, స్థానికులు పరిసరాలను శుభ్రం చేశారు. పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా పోర్టు పరిసర ప్రాంతాల్లో శుభ్రతపై అవగాహన కల్పించడం, వ్యర్థాల నిర్వహణ పద్ధతులను ప్రోత్సహించడం కోసం పోర్ట్ పలు కార్యక్రమాలు రూపొందించింది.

**జిల్లా పరిషత్‌లో స్వచ్ఛతాహీ సేవ..**

జిల్లా పరిషత్ ఆవరణలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో పి.నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్ పర్యవేక్షణలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది జిల్లా పరిషత్ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు తొలగించి చెత్తా చెదారాలు ఏరివేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్‌కు చెందిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


స్వచ్ఛతా హీ సేవలో పాల్గొన్న అధికారులు, సిబ్బందితో సీఈవో నారాయణమూర్తి

## క్లుప్తంగా

### సంపత్ వినాయగర్‌ను దర్శించుకున్న ఒడిశా గవర్నర్


గవర్నర్ హరిబాబుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈవో ప్రసాదరావు

**మహారాణిపేట:** ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు కుటుంబ సమేతంగా ఆశీల మెట్టలోని సంపత్ వినాయగర్‌ను గురువారం దర్శించుకున్నారు. అర్చన అనంతరం మంగళ హారతులు అందజేసి, స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం, ఫొటో, స్థలపురాణ పుస్తకాన్ని ఈవో ప్రసాదరావు అందజేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండపంలోని దుర్గాదేవిని గవర్నర్ కుటుంబ సమేతంగా దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### యువజనోత్సవాల్లో విద్యార్థినుల సత్తా


సత్తా చాటిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ మంజుల

**డాబాగార్డెన్స్:** యువజనోత్సవాల్లో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు వివిధ పోటీల్లో సత్తా చాటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పేర్కొన్నారు. జానపద నృత్యంలో ప్రథమ బహుమతి, బృంద గానంలో ద్వితీయ బహుమతి, రంగోలీ పోటీలో ద్వితీయ బహుమతి సాధించారని తెలిపారు. జాతీయ సేవా పథకం యువతలో సేవా దృక్పథాన్ని, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి దోహదపడుతుందని చెప్పారు. వివిధ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు ఆయా అంశాల్లో శిక్షణనిచ్చిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లను ప్రిన్సిపాల్ అభినందించారు.

### ఒడిశా గవర్నర్‌ను కలిసిన బీజేపీ నాయకులు


ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబును కలిసిన రవికుమార్ తదితరులు

**మహారాణిపేట:** గురువారం ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబును బీజేపీ ఏపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, బి.భాగ్యలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి పేదలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవల గురించి తెలిపారు.

### అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

**మహారాణిపేట:** బియ్యం, పప్పులు, నూనెలు, కూరగాయలు అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రైస్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు బజార్ వర్తకులకు జేసీ పలు సూచనలు చేశారు. ఎస్టేట్ ఆఫీసర్లు రైతు బజార్లలో పరిశుభ్రత పాటించాలని, రైతులు నిర్దేశించిన స్థలంలో మాత్రమే కూరగాయలు విక్రయించాలన్నారు. రైతు బజార్లు సాయంత్రాలు కూడా పని చేస్తున్నాయని, అప్పుడు తాజా కూరగాయలు దొరికేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో వి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

### వివేకానంద జయంతి సందర్భంగా క్విజ్ పోటీలు

**మహారాణిపేట:** రానున్న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని, అక్టోబర్ 15వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని సెట్విస్ సీఈవో కొల్లి కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. https//mybharat.gov.in/quiz లింకు ద్వారా పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఆంగ్లంతో సహా 12 భారతీయ భాషల్లో ఏదైనా ఒక భాషలో క్విజ్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 15–29 ఏళ్లలోపు వయసు గల వారు ఈ పోటీకి అర్హులన్నారు.

## పలు రూపాల్లో పూజలందుకున్న దుర్గమ్మ


ఉడిపి శ్రీకృష్ణుని అలంకరణలో కన్యకాపరమేశ్వరి


లలితాదేవిగా సాగర గిరి కనకదుర్గమ్మ

**డాబాగార్డెన్స్:** పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి గురువారం ఉడిపి శ్రీకృష్ణుడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్లు కరిమిశెట్టి వెంకటరమణ, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పూసర్ల సంజీవి, దేవాలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంకట బాలాజీకుమార్, ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

**కాత్యాయినిగా దుర్గాలమ్మ..**

వెలంపేటలో వెలసిన దుర్గాదేవి అమ్మవారు కాత్యాయిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. శుక్రవారం మహాలక్ష్మిదేవిగా దుర్గాలమ్మ దర్శనమివ్వనున్నారు.

**కాత్యాయినీదేవిగా ఉమాదేవి..**

**అల్లిపురం:** టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో ఉమాదేవి అమ్మవారు గురువారం కాత్యాయినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ బుధవారం భక్తులకు లలితాదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

## జీఎస్టీ సంస్కరణలపై అవగాహన తప్పనిసరి


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్. చిత్రంలో డీఎస్‌వో భాస్కరరావు

**మహారాణిపేట:** జీఎస్టీ సంస్కరణలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని, మారిన ధరలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ సూచించారు. ఈ మేరకు గురువారం డిస్ట్రిక్ట్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రైతు బజార్లు, రేషన్ దుకాణాలు, ఆర్టీసీ, ఆర్టీవో, ఈపీడీసీఎల్, హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థల పరిధిలో చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. సభ్యులు, అధికారుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. జీఎస్టీ సంస్కరణలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో చర్యలు, పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. నిబంధనల ఉల్లంఘన జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, సివిల్ సప్లై అధికారులు క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి భాస్కరరావు, వినియోగదారుల మండలికి చెందిన డాక్టర్ పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రోత్సాహం అవసరం


విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న పైడి రజని

**డాబాగార్డెన్స్:** చదువుకునే ప్రతి ఒక్కరికి ప్రోత్సాహం అవసరమని శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ (సేవ) అధ్యక్షురాలు పైడి రజని అన్నారు. ఏవీఎన్ కళాశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నోట్ బుక్స్ అందిస్తుందని, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుకునే వారికి స్వచ్ఛంద సంస్థలు అందజేయాలన్నారు. ఇదే కళాశాలలో చదువుతున్న పలువురు పేద విద్యార్థులకు శక్తి సంస్థ తరఫున ఫీజులు చెల్లించామని, వివిధ ప్రాంతాల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు దుస్తుల పంపిణీతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు చేపడతున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, అధ్యాపకులు డాక్టర్ అర్చన, ఎస్.ఇందిర, అప్పారావు తదితరులు పాల్గొని రజనిని అభినందించారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు వ్యాస రచన, వక్తృత్వ, పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డబ్బీరు గాయత్రి, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 25, 26 తేదీల్లో రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు


వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

**అల్లిపురం:** జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో 38వ రాష్ట్రస్థాయి యోగా పోటీలు అక్టోబర్ 25, 26 తేదీల్లో నిర్వహించనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటరమణ తెలిపారు. ఈ పోటీలు 26 జిల్లాల బాలబాలికలు, యువతీ యువకులు, 60 ఏళ్లు పైబడిన వారికి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వెంకోజీపాలెం సీఎంఆర్ ఫంక్షన్ హాల్లో జరుగుతాయన్నారు. స్త్రీ, పురుషులు, బాలబాలికలకు వయసుల వారీగా పోటీలో జరుగుతాయన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు డిశంబర్ 27, 28, 29 తేదీల్లో బాపట్లలో నిర్వహించే 44వ జాతీయ స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబర్ 24న సీఎంఆర్ ఫంక్షన్ హాల్లో ఉదయం 6 గంటల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9948215863, 9866077307 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

## ఏబీ బర్ధన్‌కు ఘన నివాళి


ఏబీ బర్ధన్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

**అల్లిపురం:** తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస విడిచే వరకు అనేక పోరాటాలు చేసిన గొప్ప కమ్యూనిస్టు యోధుడు స్వర్గీయ ఏబీ బర్ధన్ అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ కొనియాడారు. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో గురువారం బర్ధన్ 101వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య విద్యార్థి నేతగా ప్రారంభమై జాతీయ ప్రధాన కార్యదర్శిగా, దేశ రాజకీయాల్లో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్న గొప్ప నేత అని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు క్షేత్రపాల్, మన్మథరావు, కాసులరెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## కన్వేయన్స్ డీడ్ ఇప్పించాలని వినతి


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ముదపాక రైతులు

**మహారాణిపేట:** పెందుర్తి మండలం ముదపాకలో తమకు కన్వేయన్స్ డీడ్ ఇప్పించాలని రైతులు కోరారు. గురువారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్, జేసీ మయూర్ అశోక్‌ను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ముదపాకలో 1,38,66, 75,76,80,82,83 సర్వే నంబర్లలోని భూములు తమ సాగులో ఉన్నాయని, ఇక్కడి తోటలను తాము సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని, వీటికి కన్వేయన్స్ డీడ్ ఇప్పించాలని కోరారు.

## లక్ష్మీనరసింహ స్వామికి పంచామృతాభిషేకం


స్వామికి అభిషేకం చేస్తున్న పండితుడు

**సీతంపేట:** భాద్రపద స్వాతి నక్షత్రం సందర్భంగా లలితానగర్ శ్రీలలితా పీఠంలో కొలువైన లక్ష్మీనరసింహ స్వామికి గురువారం వేద పండితులు విశేష పంచామృతాభిషేకం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన స్వామికి విశేష హారతులు సమర్పించారు.

## నేడు జాబ్ మేళా

**మురళీనగర్:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26న ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో పది కంపెనీలు పాల్గొని 900 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ చదివిన ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్యం.ఏపీజీవోవీ.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని అడ్మిట్ కార్డ్‌తో హాజరు కావాలని చెప్పారు. వివరాలకు 85558 68681 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## చిరు వ్యాపారులపై దాడులు ఆపాలని ధర్నా


జెడ్సీ రాముకు వినతిపత్రం అందిస్తున్న చిరు వ్యాపారులు, సీఐటీయూ నాయకులు

**కంచరపాలెం:** కూటమి ప్రభుత్వం తోపుడు బండ్లు, చిరు వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని వారం రోజులుగా దుకాణాలు తొలగిస్తూ వారి పొట్ట కొడుతుండటాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం జ్ఞానాపురం జీవీఎంసీ జోన్-5 కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. జోనల్ కార్యాలయానికి పెద్ద ఎత్తున కార్మికులు తరలివచ్చి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కంచరపాలెం జోన్ కార్యదర్శి ఒమ్మి అప్పారావు మాట్లాడుతూ చిరు వ్యాపారులను లేకుండా చేయడం ద్వారా విదేశీ, స్వదేశీ మాళ్లకు ఎటువంటి ఆటంకాలు ఉండకుండా చేసే ఉద్దేశంతో చంద్రబాబు ప్రభుత్వం ఈ దాడులు చేస్తోందని ఆరోపించారు. తోపుడు బండి, చిరు వ్యాపారులను తొలగించి ఆ స్థలాలను కాంట్రాక్టర్లకు కట్టబెట్టడం కోసమే ఈ ప్రయత్నాలు చేస్తోందన్నారు. తక్షణమే ఈ దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలు, వ్యాపారులు పోరాటాల ద్వారా కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అనంతరం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు వినతిపత్రాలు అందించారు. చిరు వ్యాపారులతో జెడ్సీ మాట్లాడుతూ పర్మినెంట్ స్ట్రక్చర్ నిర్మాణం ఉంటే తొలగిస్తున్నామని, తోపుడు బండ్లను తొలగించడం లేదని తెలిపారు. వ్యాపారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పి.మూర్తి, నాయకులు జి.శ్రీనివాసరావు, ఎల్లాజీ, ఎస్.చిరంజీవిరావు, కమిటీ సభ్యులు ఆర్.నంద, పి.పూర్ణ, ప్రసాదులు, శ్రీనివాసరావు, బషీర్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులను సస్పెండ్ చేయాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

**బీచ్‌రోడ్డు:** జీవీఎంసీ పరిధిలో వేలాది మంది వీధి విక్రయదారుల జీవనోపాధి ధ్వంసం చేసి, వారి జీవించే హక్కును కాలరాస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ విశాఖ జిల్లా కమిటీ తరఫున జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వీధి విక్రయదారుల చట్టం 2014 ప్రకారం వీధి విక్రయదారుల జీవనోపాధి, వారు గౌరవప్రదంగా జీవించే హక్కును కాపాడాల్సిన బాధ్యత జీవీఎంసీ కమిషనర్‌కు కట్టబెట్టిందన్నారు. కానీ దానికి విరుద్ధంగా ఆపరేషన్ లంగ్స్ పేరుతో పేదలపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఇప్పటికైనా వీధి విక్రయదారులకు రక్షణ కల్పించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. లక్ష్మి, అనుబంధ ఏపీ ప్రగతిశీల వీధి విక్రయదారుల సంఘం ప్రధాన కార్యదర్శి చిన్నం చిన్నారి, బి. గీత, ఎస్. వెంకటలక్ష్మి, ఇ. లక్ష్మి, బి. రామకష్ణ, వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

## విద్యుత్ సిబ్బంది జీతాలు పెంచాలని వినతి


ఏపీఈపీడీసీఎల్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

**తాటిచెట్లపాలెం:** ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 5 జిల్లాల్లో ఎనీ టైం పేమెంట్ మెషీన్ (విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రం)లో పని చేస్తున్న సిబ్బందికి జీతాలు పెంచాలని, వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు గురువారం గురుద్వారా వద్ద గల ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు ఫైనాన్స్ డైరెక్టర్ చంద్రం ద్వారా వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిటు జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ ఈ సేవా కేంద్రాల్లో సుమారు 80 నుంచి 100 మంది సిబ్బంది పనిచేస్తున్నారని, వీరికి కేవలం రూ.7 వేల జీతం రెండేసి నెలలకోసారి ఇస్తున్నారని తెలిపారు. వీరికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలు, వారాంతపు సెలవులు, సిక్ లీవ్‌లు గానీ, మహిళా సిబ్బందికి ప్రసూతి సెలవులు కూడా ఇవ్వడం లేదని, సంబంధిత కాంట్రాక్టర్ కార్మిక నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. వీరి సమస్యలు పరిష్కరించేలా అధికారులు కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చంద్రశేఖర్, సత్యనారాయణ, సత్యారావు, రాజేష్, సాయిలక్ష్మి, గాయత్రి, ప్రశాంతి, రాధ తదితరులు పాల్గొన్నారు.

## దీన్ దయాళ్‌కు ఘన నివాళి

**తాటిచెట్లపాలెం:** సీతమ్మధారలోని బీజేపీ ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆ పార్టీ వ్యవస్థాపకుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక మాట్లాడుతూ దీన్ దయాళ్ పార్టీకి చేసిన సేవలు వెలకట్టలేనివని, ఆయన కృషితో నేడు పార్టీ ఈ స్థాయికి వచ్చిందని తెలిపారు. ముందుగా ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు.